3. కథలు

# చిలుక, కాకి కథ

శ్రీమతి దరిశి అన్నపూర్ణమ్మగారు

అడవిలో ఒక రాగిచెట్టుండేది. ఆకుకనబడకుండా రాగిపండ్లుండేవి. గుంపులుగుంపులుగా చిలుకలు కాకులువచ్చి రాగిపండ్లుతినేవి. అందులో ఒకకాకి, ఒకచిలుక పండ్లకొరకు తగువువేసెను. చిలుక కాకిని జూచి "కాకి కన్నులొట్టపోని" అన్నది. కాకికన్నులొట్టపోయింది. కాకికి కోపంవచ్చింది. "చిలుకమూతి సొట్టపోని" అన్నది కాకి. చిలుకమూతి సొట్టపోయింది. రాజుగారి ఏనుగ రాగిఆకులు తినడానికివెళ్లి "కాకీ! నీకన్నులొట్టపోయిందే" మన్నది. "నేనేమని జెప్పేది? కాకికన్నులొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనుకకుపోనీ" అన్నదికాకి. అలాగే ఏనుగతొండం వెనక్కుపోయింది. ఏనుగ ఏటికివెళ్లి తోకకు అతుక్కొనిపోయిన తొండంతో నీరుత్రాగింది. ఏరు ఏనుగతో "తొండంవెనకుపోయిందే" మన్నది. ఏనుగ "నేనేమనిచెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది; ఏటిలో నీరెండిపోనీ" అన్నది. ఏటిలో నీరెండిపోయింది. అత్తా, కోడలు మడినీరు తెచ్చుటకు ఏటికివెళ్లిరి. నీరులేనందున "ఏరా! ఏరా! నీరెందుకులేదన్నారు". ఏరు "నేనేమనిచెప్పేది, కాకి కన్నులొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలోనీరెండిపోయింది, అత్తా కోడల తలలకు బిందెలంటుకుపోనీ" అన్నది. దానిమాటప్రకారమే బిందెలంటుకొనిపోయినవి. ఇద్దరు యింటికివెళ్లేసరికి మామగారు జపముచేయడానికి జపమాలతో కూర్చొన్నారు. మామగారు కోడలను జూచి "నీళ్లెందుకు లేవే" దన్నారు. "నేనేమనిజెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది,; ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలో నీరెండిపోయింది, అత్తా కోడల తలలకు బిందెలంటుకొన్నవి, మామగారిచేతికి జపమాలంటుకొపోనీ" యని కోడలనేసరికి జపమాల శెట్టిగారిచేతికి అంటుకొనిపోయింది. శెట్టి జపమాలతోగూడ కోర్టుకువెళ్లెను. జడ్జీ శెట్టినిజూచి "కోర్టుకు జపమాల తెచ్చినావెందుకు?" అన్నాడు. శెట్టి "నేనేమనిజెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలో నీరెండిపోయింది, అత్తా కోడలకు బిందెలంటుకొన్నవి, శెట్టిచేతికి జపమాలంటుకొన్నది, జడ్జీగారికి, వకీళ్లకు కుర్చీలంటుకొపోనీ" అన్నాడు. అందరికి కుర్చీలంటుకొన్నవి. కుర్చీలు ఏలాగువదిలించడం తెలియక అందరుచేరి గట్టిగ బొబ్బలు పెట్టేరు. బొబ్బలువిని ఊళ్లోవాండ్లంతా భయపడి కోర్టుచుట్టుగుమిగూడిరి. వారిలో ఒకగోసాయి జడ్జీనిజూచి జరిగినకథ చెప్పమన్నాడు. జడ్జీ "నేనేమనిచెప్పేది, కాకికన్ను లొట్టపోయింది, చిలుకమూతి సొట్టపోయింది, ఏనుగతొండం వెనక్కుపోయింది, ఏటిలో నీరెండిపోయింది, అత్తాకోడలకు బిందెలంటుకొన్నవి, శెట్టిగారిచేతికి జపమాలంటుకొన్నది, జడ్జీకి వకీళ్లకు కుర్చీలంటుకొన్నవి, గోసాయినోటిలో గంజాఅని చెప్పబోవుచుండగ హాచ్చుమ్మని తుమ్మెను. తుమ్ముతో శాపం తీరిపోయింది. జడ్జీకి, వకీళ్లకు అంటుకొన్న కుర్చీలు ఊడిపోయెను, శెట్టిగారి జపమాలవిడిపోయింది, అత్తాకోడల తలలకు అంటుకొన్న బిందెలు సడలెను, ఏరు క్రొత్తనీటితో నిండిపోయింది, ఏనుగతొండం యథాప్రకారం వచ్చింది, కాని చిలుకమూతి సొట్ట, కాకికన్ను లొట్ట శాశ్వతంగాఉన్నవి.

# ఇత్తడి అత్తగారు

శ్రీమతి కొప్పర్తి సీతాబాయిగారు

అనగనగా ఒకబ్రాహ్మడి కిద్దరుకొడుకులు. ఇద్దరికీ పెళ్లిళ్లయి కోడళ్లువచ్చేరు. అత్తగారికి చిన్నకోడలంటే చాలాయిష్టం, పెద్దకోడల్ని సాధించిపోయడం. కొన్నాళ్లకి

829

మామ పరలోకానికి వెళ్లేడు. అన్నదమ్ములు పంచుకున్నారు. ఎల్లాగంటే అత్తగారు ఒక భాగం, ధనమంతా ఒకభాగం. చిన్నకోడలు అత్తగార్ని తీసికుంది. ధనమంతా పెద్దకోడలికి వెళ్లింది. చిన్నకోడలు పొద్దున్నే లేచి "అత్తా! మొహంకడుక్కో. అత్తా! మడికట్టుకో" అని అస్తమానూ అత్తగారికీ ఉపచారాలు చేస్తుండేది. ఇదంతాచూస్తే పెద్దకోడలికి అత్త గారు కావాలని మనసుఅయింది. డబ్బుందికనక ఒకఇత్తడిబొమ్మని చేయించి దాన్ని అత్త గారు అనిభావించుకుని అన్నివుపచారాలు చేస్తుండేది. ఏపనీ వేళకుచెయ్యకుండాఉంటే పెని మిటిప్రాణంవిసికి ఇంట్లోంచిలేచిపొమ్మన్నాడు. పాపం ఆవిడ ఆఇత్తడిబొమ్మను కూడా తీసికుని పోయింది. అలావెళ్లేటప్పటికి ఒక అరణ్యందగ్గర చీకటిపడిపోయింది. క్రిందపడుకుంటే ఏవన్నా చంపేస్తాయని ఒకమర్రిచెట్టెక్కి అత్తగార్ని వళ్లోపెట్టుకుని పడుకుంది. ఆరాత్రిదొంగలు రాజుగారింట్లో కన్నంవేసి ఆచెట్టుక్రింద పంచుకుంటున్నారు ధనమంతా. పైననిద్రపోతూన్న కోడలివళ్లోనించి ఇత్తడిఅత్తగారు జారి గలగలమంటూ వాళ్లదగ్గరపడింది. పడీపడ్డంతో దొంగలంతాభయపడి "బాబో! శక్తి" అంటూ నలుగురు నాలుగుదిక్కులకి పరుగెత్తేరు. ఈఅల్లరితోటి కోడలికి మెలుకువవచ్చి దగ్గర అత్తగారులేకపోవటంచేత క్రిందకిదిగి చూసింది. అక్కడమిరుమిట్లుగొలుపుతో బోలెడంతిధనం, అత్తగారు కనబడ్డారు. ఇదంతా ఇత్తడత్త గారి మహాత్యమేనని ఆడబ్బుని, అత్తగారిని తీసికుని తెల్లారేటప్పటికి ఇంటికివెళ్లి తలుపుతీయ మంది. 'ఛీ.నాయింటికిరావద్దు" అన్నాడుపెనిమిటి. "అల్లాకాదు.డబ్బు పట్టుకొచ్చా" ననిచెప్పి లోపలికెళ్లి డబ్బువచ్చిన విధమంతాచెప్పి డబ్బుకొల్చుకోడానికి తోడికోడల్ని కుంచంఅడిగింది. ఆవిడ గడుసుది గనక కుంచానికి కాస్త చింతపండు పెట్టిఇచ్చింది. పెద్దకోడలు కొలుచుకుని కుంచం దులపడంమరిచిపోయి ఇచ్చేసింది. కుంచానికి ఒకవరహా అంటుకుంది. అది చిన్న కోడలు చూచి "అక్కా! ఈడబ్బు ఏలావచ్చింది?" అని అడిగింది. పెద్దకోడలు జరిగిందంతా చెప్పింది. "నీవు ఇత్తడత్తగార్ని తీసికెడితే నేనునిజమత్తగార్ని తీసికెడతా" నని చెప్పి వెయ్యి గజ్జలుతెప్పించి అత్తగారికికట్టి సాయంకాలానికి ఆచెట్టుదగ్గరకివెళ్లి చెట్టుమీదకూర్చుంది నిద్ర పోకుండా. అప్పుడుకూడా దొంగలు ధనందోచుకుని పంచుకుంటుంటే అత్తగార్ని కిందకివిడిచింది. ఆదొంగలు "ఇదేమిటి? మొన్న ఈలాగేఅయింది. ఈవేళా ఇలాగేవుంది" అని చెట్టెక్కి చూశారు. వణుకుతూ చిన్నకోడలు కనిపించింది. ఆవిణ్ని మెత్తగా తన్నిపంపేరు. పాపం అత్త గారు ముసల్దికనక క్రిందపడగానే ఢమ్మనిచచ్చింది. ఏడుస్తో చచ్చినఅత్తగార్ని బుజాన్నవేసి కుని ఇంటికెడితే మొగుడు కేకలేశాడు. అత్తపోయింది, డబ్బులేదు అని చాలావిచారించింది.

## అరడబ్బు

శ్రీమతి ధవళ రాజేశ్వరమ్మగారు

అనగా అనగా ఒకఊళ్లో ఒక బ్రాహ్మణుడుండేవాడు. వాడిపేరు "అరడబ్బు". వాడికి తినడానికి తిండిలేకపోయినా మంచినేర్పుతో డబ్బుసంపాదించే చాకచక్యముకలదు. ఇల్లా ఉండగా ఒకనాడు వాడు